# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

https://epaper.telanganaveena.com/

DYNAMIC 5:00PM

ఆదివారం /31.03.2024


## సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన రద్దు..

* సీఈసీ సమావేశం మార్పుతో సీఎం రేవంత్ ఢిల్లీ టూర్ రేపటికి వాయిదా..
* పెండింగ్‌లో ఉన్న నాలుగు ఎంపీ అభ్యర్థులను ఖరారు చేయనున్న సీఈసీ

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి, ఆత్రం సుగుణ



## కుమార్తె కావ్యతో కలిసి కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి



తెలంగాణవీణ,హైదరాబాద్

బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ నేత కడియం శ్రీహరి.. కుమార్తె డాక్టర్ కావ్యతో కలిసి కొద్దిసేపటి క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలైన తర్వాత పార్టీ నుంచి వలసలు ప్రారంభమయ్యాయి. పలువురు నేతలు అధికార పార్టీలోకి వెళ్లగా, మరికొందరు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో సీనియర్ నేతలు అయిన కడియం శ్రీహరి, కేకే వంటి నేతలు పార్టీని వీడడం అన్నింటికంటే ఎక్కువ సంచలనమైంది. మరీముఖ్యంగా  కడియం కావ్యను వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా బీఆర్ఎస్ ప్రకటించింది. అయితే, దానిని కాదనుకుని మరీ ఆమె పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరడం సంచలనమైంది. పార్టీకి రాజీనామా చేస్తూ పార్టీ అధినేత కేసీఆర్‌కు లేఖ రాసిన కావ్య.. ఫోన్‌ట్యాపింగ్, కుంభకోణాలు, అవినీతి ఆరోపణలు వంటివి పార్టీ ప్రతిష్ఠను దిగజార్చాయని, దీనికితోడు లోక్‌సభ అభ్యర్థిని అయిన తనతో నేతలు ఎవరూ కలిసి రావడం లేదని ఆరోపించారు. కాగా, నిన్న జీహెచ్‌ఎంసీ మేయర్, కేకే కుమార్తె విజయలక్ష్మి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్ఎస్ నుంచి మరికొందరు నేతలు పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది.

## తాడేపల్లి అపార్ట్‌మెంట్ వాసులతో లోకేశ్ సమావేశం



తెలంగాణవీణ,ఏపీ బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలు వదిలి సినిమాల్లోకి వస్తే ఆస్కార్, భాస్కర్ అవార్డులు అన్నీ ఆయనకే దక్కుతాయని టీడీపీ యువనేత నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. సొంత బాబాయిని హత్యచేసి ఆ నెపాన్ని కుటుంబ సభ్యులపైకి నెట్టిన మహానటుడు జగన్ అని విమర్శించారు. ఈ ఉదయం గుంటూరు జిలా తాడేపల్లిలోని అన్నపూర్ణ రెసిడెన్సీలో స్థానికులతో లోకేశ్ సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాగానే పాత ఇసుక విధానాన్ని తీసుకొస్తామని చెప్పారు. మైనింగ్ విభాగంపై విచారణ కమిటీ వేస్తామన్నారు. జగన్ ప్రభుత్వం గత ఐదేళ్లలో 9సార్లు విద్యుత్తు చార్జీలను పెంచిందని మండిపడ్డారు. ఇంటిపన్ను, గ్యాస్,పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గిస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.

## అధ్వానికి భారత రత్న.. ఇంటికి వెళ్లి అందించిన రాష్ట్రపతి..



తెలంగాణవీణ,జాతీయం

బీజేపీ కురువృద్ధుడు లాల్ కృష్ణ అధ్వానికి దేశ అత్యున్నత పురస్కారం 'భారత రత్న' అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందజేశారు. ఆదివారం ఆడ్వాణీ నివాసానికి వెళ్లి అక్కడే ఈ పురస్కారం అందించారు. శనివారం రాష్ట్రపతి భవన్ లో భారత రత్న అవార్డుల ప్రధానోత్సవం జరిగిన విషయం తెలిసిందే. అనారోగ్య సమస్యల కారణంగా ఈ కార్యక్రమానికి అధ్వాని హాజరుకాలేకపోయారు. దీంతో ఆదివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్వయంగా అధ్వాని నివాసానికి వెళ్లారు. భారత రత్న అవార్డును అధ్వానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా, అవిభక్త భారతదేశంలోని కరాచీలో జన్మించిన ఆడ్వాణీ పద్నాలుగేళ్ల వయసులో ఆర్ఎస్ఎస్ లో చేరారు. హైదరాబాద్ (ప్రస్తుతం పాక్ లో ఉన్న సిటీ) లో న్యాయ విద్య పూర్తిచేశారు. దేశ విభజన తర్వాత ముంబైలో స్థిరపడ్డారు. 1970లో తొలిసారి రాజ్యసభ సభ్యుడిగా పార్లమెంట్ లో అడుగుపెట్టారు.1977లో జనతా పార్టీ ప్రధాన కార్యదర్శిగా, అదే ఏడాది కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 1980లో జనతా పార్టీ తరఫున రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారు. బీజేపీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన ఆడ్వాణీ.. అయోధ్య రథయాత్రతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. రామజన్మభూమి ఉద్యమానికి ఈ యాత్ర ప్రాణం పోసిందని రాజకీయ వర్గాల ఉవాచ. లోక్‌సభలో సుదీర్ఘకాలం పాటు ప్రతిపక్ష నేతగా పనిచేసిన ఆడ్వాణీ.. 2019 నుంచి క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. అనారోగ్య సమస్యలతో ప్రస్తుతం ఇంటికే పరిమితమయ్యారు.

## కేసీఆర్ జిల్లాల పర్యటన



తెలంగాణవీణ,జనగామ

నేడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జిల్లాలో పర్యటించనున్నారు. నీటి ఎద్దడితో ఎండిపోతున్న పంటలను పరిశీలించి, కరువుతో అల్లాడుతున్న రైతుల్లో ధైర్యం నింపేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జిల్లాల వారీగా పర్యటించనున్నారు. అందులో భాగంగానే ఇవాళ జనగామ, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో పర్యటించనున్నారు. పంటలను పరిశీలించి రైతుల్లో ధైర్యం నింపనున్నారు. ముందుగా జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలో పర్యటిస్తారు. అక్కడి నుంచి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం అర్వపల్లికి వెళ్తారు. అనంతరం నల్గొండ జిల్లా హాలియా మండలంలో పర్యటించి రైతులను ప్రోత్సహించనున్నారు.


## సిలిండర్ పేలుడు.. ఐదుగురు సజీవదహనం



తెలంగాణవీణ,జాతీయం

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లోని సింధియా నగర్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఇక్కడ ఓ ఇంటిపై హైటెన్షన్ వైరు పడింది. దీంతో ఇంట్లోకి కరెంట్ సరఫరా వచ్చింది. దాంతో ఇంట్లో ఉంచిన సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని ఐదుగురు వ్యక్తులు తీవ్రంగా కాలిపోయారు. ఇరుగుపొరుగు వారి సహాయంతో పోలీసులు అందరినీ జయరోగ్య ఆసుపత్రిలోని కాలిన వార్డులో చేర్పించారు.

## కృష్ణ ఎక్స్‌ప్రెస్ కు తప్పిన ప్రమాదం



తెలంగాణవీణ,యాదాద్రి

సికింద్రాబాద్–తిరుపతి పద్మావతి ఎక్స్‌ప్రెస్ లో పొగలు వ్యాపించిన ఘటన మరువక ముందే కృష్ణ ఎక్స్ ప్రెస్ ట్రైన్ వెళుతున్న రైలు పట్టారు విరిగిపోవటం ఘటన సంచలనంగా మారింది. ఆదిలాబాద్ నుంచి తిరుపతి వెళ్లే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం తప్పింది. ఈ ఉదయం సికింద్రాబాద్ నుంచి బయలుదేరిన రైలు యాదాద్రి జిల్లా ఆలేరు స్టేషన్ దాటుతుండగా పెద్ద శబ్దం వినిపించింది. భయాందోళనకు గురైన ప్రయాణికులు రైలు సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన అధికారులు రైలును నిలిపివేశారు. పట్టాలను పరిశీలించి పట్టాలు విరిగిపోయి మరమ్మతులు చేశారు. అనంతరం రైలు అక్కడి నుంచి కదిలింది. ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.